## మల్లాది వెంకట కృష్ణమూర్తి

### మినీ కథ

# "భయంకర సంఘటన"

"నా జీవితంలో నేనెదుర్కొన్న భయంకర సంఘటనా!" అడిగాడు తన యూనిట్ మెంబర్స్‌తో ఓ అవుట్ డోర్ లొకేషన్‌లో ముచ్చటిస్తున్న చిత్ర నిర్మాత.

"అవును చెప్పండి." అడిగాడు ఆ చిత్ర నటుడు.

"మొదటి చిత్రం సగ అవ్వక ఆ కథ సెన్సార్ రూల్స్‌కి విరుద్ధంగా వుందని ఓ స్నేహితుడు చెప్పాడు. సెన్సార్ బోర్డుకి స్క్రిప్ట్ పంపితే వాళ్లు ఫర్వాలేదనేదాకా నీళ్ళు, నిద్ర లేదంటే నమ్మండి."

తర్వాత ఆ చిత్ర నటుడు చెప్పాడు తన జీవితంలో ఎదుర్కొన్న ఓ భయంకర సంఘటన.

"పది సంవత్సరాల క్రితం టీ నగర్‌లో ఓ ఇల్లు కొన్నాను ఆ ఇంటికి ఎవరో చేతబడి చేసారట బయట నుంచి రాళ్ళు వచ్చిపడేవి. ఇంట్లో సామాను వుంచిన చోట వుంచినట్లుండేవికాదు. మనుషులు కనబడేవారుకాదు. ఎవరో నవ్వినట్టు, ఏడ్చినట్టు వినబడేది పది రోజుల్లో యింకో యింట్లోకి మారాను"

నిర్మాత ఆ చిత్ర దర్శకుడిని అడిగాడు "మీ అనుభవాలేమైనా వున్నాయా?"

దర్శకుడు గ్లాసులోని బీర్‌ని పూర్తి చేసి చెప్పాడు.

నాలుగు సంవత్సరాల క్రితం గుంటకల్‌నించి మద్రాస్ వస్తున్నాను కారులో. నిద్ర మత్తులో డ్రయివర్ బండిని ఓ ఎద్దుల బండికి గుద్దేసాడు. నా వళ్ళంతా రక్తం. కదలడానికి వీల్లేకుండా ఇరుక్కుపోయాను కారులో—రక్తం కారిపోతోంది, స్పృహ తప్పింది. అదృష్టవశాత్తు ఓ ఆర్ టి సి బస్ డ్రయివర్ నన్ను చూసి ఆస్పత్రికి తీసుకెళ్ళాడు. పది నిమిషాలు ఆలస్యం అయినా పోయివుండేవాడినట!"

కెమెరామెన్ అంతదాకా నిశ్శబ్దంగా వాళ్ళ సంభాషణ వింటూ వున్నాడు గొంతు సర్దుకుని చెప్పాడు.

"మనందరికీ సంబంధించిన ఓ భయంకర సంఘటన ఇందాకే నా దృష్టిలోకి వచ్చింది. గత పదహారు రోజులుగా చిత్రీకరించిన ఫిలింపూర్తిగా వృధా అయింది మద్రాస్‌లోని లేబరేటరీ నుంచి టెలిగ్రాం వచ్చింది.... కెమేరా షట్టర్ తెరపడం మరిచారు దాన్ని సప్లయి చేసిన అవుట్‌డోర్ యూనిట్ సప్లయర్."

నిర్మాత క్షణకాలం మౌనలో వుండిపోయారు. తర్వాత కళ్ళు మూసుకొని బీర్‌బాటిల్ ఎత్తి గటగట తాగేసాడు ❊